# నేను పోనే

తెలతెల వారుతోంది. తల్లి వచ్చి లేపకుండానే నాగభూషి లేచాడు. కళ్ళు నులుముకున్నాడు. అరి చేతిలో "శ్రీరామ" వ్రాసుకున్నాడు. కళ్ళనద్దుకున్నాడు. 'అమ్మా!' అన్నాడు. అమ్మ పలకలేదు. నెమ్మదిగా లేచాడు. చాప చుట్టచుట్టాడు. లోపలికి వెళ్ళి పెట్టాడు. తల్లి ఎదురైంది.

"అప్పుడే లేచావేరా, పిచ్చి సన్యాసీ!"

సీతమ్మకు ఇదిగానే ఉంది.

"నిద్దరపట్టలేదే అమ్మా! తెల్లార్లూ ఒకటే కలలే అమ్మా, బళ్లో కెళ్ళినట్టూ, పరీక్షలయినట్టూ, ఫస్టున ప్యాసయినట్టూ కలలే" అన్నాడు నాగభూషి.

సీతమ్మ కొడుకుకేసి చూసింది. తన పనిలో మునిగింది. నాగభూషి లేచివచ్చాడు. తెల్ల వారుతోంది. తల్లి రోటిదగ్గర కూచుని పచ్చడి చేస్తోంది.

"నీకేమన్నా సాయితా చెయ్యనా అమ్మా?"

సీతమ్మకు నవ్వు వచ్చింది.

"ఏమమ్మా నవ్వుతావు? నేనేం చెయ్యలేనా?"

"ఏనేం లేదులేరా నాన్నా"

రెండునొక్కులు నొక్కేప్పటికి పచ్చడి అయిపోయింది. రాచ్చిప్పలోకి పచ్చడి తీసుకొని, రోట్లో యిన్ని నీళ్ళుపోసి ఆమె ఇంట్లోకి వెళ్ళిపోయింది.

ఆమెకు అప్పుడు సంతోషంగా ఉంది. పసినాపకు పడసారం పదేళ్ళు నిండాయో లేదో, సాయితా వొస్తానంటున్నాడు. ఇచ్చిన దేముడు మర్చిపోవాలి. వీడు నాలుకాలాలపాటు క్షేమంగా వుండాలి.

తగని అల్లరి వెధవ. ఎప్పుడూ ప్రాణాలు వీడిమీదే. తను ఏం చేస్తున్నా పంచప్రాణాలు వీడిమీదే వుంటై. చదువుకోరాదుట్రా అన గూడదు. వొచ్చేసిందంటాడు. ఏవొస్తుందో ఏమో. వీడి అల్లరితో తను కిందామీదా పడుతోంది. బస్తీకెట్లా వెళతాడో, ఎల్లా చదువుతాడో........ క్షణం జడురాలయింది.

నాగభూషి ఉయ్యాలతొట్లో గిలకాయలు చూసి ఆనందిస్తూ 'ఛీ' అంటే బోసినవ్వులు నవ్వేరోజుల్లో ఆమె భర్త గతించాడు. పోతూ పోతూ ఇచ్చిపోయిన ఆస్తి తొట్లో పిల్లాడు. జడలేసుకునే రోజుల్లోనే మెడ బోసిదయింది. రాతకాలింది. ఏడవటానికి కన్నీళ్ళుగూడా అప్పు తెచ్చుకోవాల్సిన స్థితిలో పసివాణ్ణి చూసుకుని నిట్టూర్చింది. గిలకాయ రంగు చూసి నవ్వుకునే నాగభూషిని చూసి తానూ నవ్వాలా? పసుపూ, కుంఖమూ పోయి ముసుగునెత్తికొచ్చినందుకు ఏడవాలా?

పుట్టిల్లనేది ముళ్ళకంచెలాంటిది. ఆడపిల్ల అత్తారింటికెళ్ళిం దంటే చాలు, పుట్టిల్లు అంతంత అవడం ప్రారంభం అవుతుంది. అందు లోనూ అవతల సర్వమంగళం అయి, చమురుకాళ్ళ మా తల్లి తిరిగి వొస్తుందన్నప్పుడు ఆడకూతురుకు జరిగే లాంఛనం ఎవరెరుగనిది?

తల్లీ, తండ్రీ ఉంటేనన్నా కాస్త మెరుగు. తల్లీ,తండ్రీ పోయాక, పుట్టింటి ఆపేక్ష ఆమడలంత దూరమూ అవుతుంది. దరిద్రంతో ప్రేమలు పిట్టలాగా ఎగిరిపోతై.

నాగభూషి నెత్తుకుని సీతమ్మ పుట్టింటికి వెళ్ళింది. ఇక్కడ చేసే చాకిరీ మరోచోట చేసుకుంటే — సొహంత్రం అన్నా ఉంటుం దని తిరిగి రానూ వచ్చేసింది.

కలిగిన మారాజుల యింట్లో వంటచేస్తూనో, దంపులు దంపుకోనో ఆమె జీవితం తలుచుకుంది. సరాసరి బస్తీ చేరిందిరో అని అనిపించుకో తలచలేదు. బస్తీ పక్కని ఓ మాదిరి ఊళ్ళో వుంటోంది. కర్ణం గారి యింట్లో వంట చేస్తోంది ప్రస్తుతం. వాళ్ళ పిల్లలు చద్దన్నాల్లో పారేసి నంత ఉండదు నాగభూషికి పెట్టేది. కరణంగారి భార్య "సీతమ్మా, వాణ్ణి కూడా ఇక్కడే తినిపిద్దూ" అని చెప్పింది. అక్కడే తింటూ ఊరి బళ్ళో చదువుతున్నాడు. దుడుకు వెధవ. ఎక్కడ వాళ్ళపిల్లల్నీ, వీళ్ళ పిల్లల్నీ ఏం చేస్తాడో, ఏ అల్లరిలో దెబ్బలుతిని వాస్తాడోనని కళ్ళల్లో వొత్తు లెట్టుకుని ఉంది.

"నేనేమైనా చదువు మానను" అని హఠం పట్టాడు నాగభూషి.

"బస్తీకి వెళ్ళిరాగలవ్రా?" అంటే 'ఓ' అని తల ఊపాడు.

నిన్న మటుకు నిన్న మారాం బట్టి డబ్బు తీసుకెళ్ళాడు. బళ్ళో పేరు చేర్పించుకున్నాడు. పుస్తకాలూ అవీ తెచ్చుకున్నాడు.

"అమ్మా నేను ఫౌంటెన్ కొనుక్కుంటానే"

"ఎంతవుతుందీ"

"మూడో, నాలుగో"

"పండక్కి కొనుక్కుందువుగానిలే. ఇప్పుడు డబ్బు చాలొద్దూ మరి?"

సీతమ్మ చచ్చీచావని గొంతుకతో అంది ఆ మాట. నాగభూషి చిన్నబుచ్చుకున్నాడు.

"ఊఁ ఊఁ; కొనుక్కోవొద్దుటే—"

"పండక్కి కొనుక్కోమని చెప్పాను గదట్రా"

"మా క్లాసు వాళ్ళందరికీ ఉంటే"

సీతమ్మకు ఏమనాలో తోచలేదు. వాయిల్ సిల్కుజాకెట్టు కొని పెట్టమని అడిగితే, తన తల్లి తనకేమి చెప్పిందో జ్ఞాపకానికి వొచ్చింది. మొగుణ్ణి నోరువిప్పి అడగడమూ అయింది "నీ అందానికి అదొక్కటేనా తక్కువ" అని ఆ మహారాజుచేత అనిపించుకోవడమూ అయింది—అప్పటికి. తల్లి ఏమందీ "పండక్కి చూద్దాంలే అమ్మా" అంది. పండక్కి తను యిక్కడ ఉండదు అని అందరికీ తెలుసు. "ఆనిక్కి చూద్దాంలే" అనడం "వీల్లేదు" అనటానికి మరోమాట."పోనీ, కొనుక్కోరా" అంది సీతమ్మ కొడుకుతో.

"పండక్కి కొనుక్కుంటాలే...."

"నిమిషంలో ఇంత కోపంవస్తే ఎట్లా? అప్పుడే అంత చిర్రూబుస్సూ ఏమిట్రో— వేలెడంత ఉన్నావో లేదో— ఎక్కడికి పోతై పోలికలూ?"

నాగభూషి చిన్నబుచ్చుకున్నాడు.

— ఇది నిన్న జరిగింది.

రాత్రి అంతా తనకు యిదే గుంజాటన. వెలితి మాట ఎందుకంటినా అని సీతమ్మ చాలాసార్లు అనుకుంది. మరీ మరీ నొచ్చుకుంది.

ఇప్పుడేమనుకుంటే ఏం లాభం? నోరుదాటాక, మాటను వెనక్కా తీసెయ్యలేం.

కంచంలో అన్నంపెట్టి కొడుకు దగ్గర కూచుంది సీతమ్మ. ఎప్పుడు వెళ్ళి పడదామా అన్న తొందరలో నాగభూషికి అన్నం సయించలేదు. ముద్ద నోట్లోకి వెళ్ళడంలేదు. నెమ్మదిగా ఆ మాటా యీ మాటా చెబుతోంది.

"జాగర్తగా వెళ్ళమ్మా: రోడ్డుకి ఓ ప్రక్కా ననడూ. బళ్ళూ, కార్లూ ఎక్కడ మీదపడతయ్యో చూసుకుంటూ నడవాలి!"

"నడుస్తాలేవే"

"ముద్ద తినూ. దిక్కులు చూస్తావేం? పైపైపోటల్లా"

"మజ్జిగ పొయ్"—

"అప్పుడే— కాస్త నాలుగు మెతుకులన్నా తినకపోతే ఎల్లాగురా? ఏమిటావేషం? తినుమరీ"

నాగభూషి మూతి తుడుచుకున్నాడు. నిక్కరూ, చొక్కా తొడుక్కున్నాడు. పుస్తకాలు తీసుకున్నాడు. వాటినతడు నిన్నరాత్రే సర్ది ఉంచాడు.

"అమ్మా, వెళతానే"—

"యిది తీసుకెళ్ళవూ?"

కరణంగారి భార్యను పాత టిఫిన్‌కారియరు చిన్నదేదనాపి ఇమ్మని నిన్న అడిగింది. పొద్దున్నే తిని వెళ్ళితే, సాయంత్రంగానీ తిరిగి యింటికి రాడామరి. యీలోగా ఎల్లా? కొందామంటే ఉన్న డబ్బంతా పుస్తకాలకూ, బళ్ళో చేరటానికే అయిపోయిందాయె. అన్నం తీసుకెళ్ళటానికని అడిగింది. బుల్లి సత్తు కారియర్ తెచ్చింది. దానికి కొక్కెం విరిగి పోయింది. కొక్కెం లేదన్న మాట తప్ప, ఫరవాలేదు. పనికొ

స్తుంది. మనబోటి వాళ్ళకు సరికొత్తవి రమ్మంటే ఎల్లా గొస్తాయేం అను కుంది ఆమె. తాడు ఒకటి తెచ్చి కొక్కానికి బదులు కట్టింది. దాన్ని శుభ్రంగా తోమింది. తోమేప్పటికి సత్తు ముండ ధళాధళా మెరుస్తోంది. దాంట్లోనే యింత అన్నమూ, మజ్జిగా కలిపి, నూరిన పచ్చడి కాస్తవేసి తెచ్చింది సీతమ్మ.

"మధ్యాన్నం ఎక్కడన్నా పెట్టుకు తినూ," అని చెప్పింది ఆమె. పొద్దోతోంది. కరణం గారింటి కెళ్ళాలని ఆవిడా బయలు దేరింది. నాగభూషి కంటికనబడే వరకూ తల వెనక్కి తిప్పి చూస్తూనేవెళ్ళింది. పిచ్చి వెధవ, తలకాయ వొంచుకుని రోడ్డుకు పక్కగానే పోతున్నాడు.

గబగబా నడుస్తూ నాగభూషి స్కూలుకు చేరుకున్నాడు. అతనూ అడుగు పెట్టున్నాడు, ఠంగ్ ఠంగ్ మంటూ బళ్ళో గంట కొడుతూ న్నారు. ఇది మంచి శకునం. అడుగు పెడుతుండగా గంట కొట్టడం మంచిదని ప్రతివారూ చెప్తారు. శకునంగూడా కలిసి వొచ్చిన ఉత్సా హంతో అతను తొందరగా లోపలికి వెళ్ళాడు. కొత్తగా స్కూలు తెరి చారు. ఆవాళనుంచే పాఠాలు చెప్పడం ప్రారంభిస్తారు. మాస్టర్లు నీటుగా వచ్చి వున్నారు. జ్యేష్ఠమాసమేమో ఎండ చెత్త మాడుస్తోంది.

కుర్రాళ్ళు గబగబా నడుస్తున్నారు, టాక్ టీక్ గా ఉన్నారు. పాలా షుడు వొచ్చి ఆపినా ఆగేట్టులేరు. ధన్ ధన్ మని నడుస్తున్నారు. కేరింత లాడుతూన్నారు. ఓ చేత్తో పుస్తకాలూ, మరో చేత్తో ఇక్ష్వాకుల నాటి సత్తు టిఫిన్ కారియర్లూ పుచ్చుకుని నాగభూషి వొచ్చాడు. చెమటకు చొక్కా తడిసి పోయింది. అడిగి తెలుసుకుని క్లాస్ రూంలో కొచ్చాడు. ఇంకా మాస్టరు క్లాసుకు రాలా.

నలుగురు పిల్లలూ వొక్కసారి అతన్ని పరకాయించి చూశారు. ఫక్కున నవ్వారు. ఎందుకు నవ్వుతారో అతనికి తెలీలేదు.

"సత్తెప్పాలా" అన్నా డొకడు. మరి కొందరు తలెత్తి అతన్ని చూశారు. ఫక్కున నవ్వారు. నాగభూషికి అర్థమైంది. రోషం వొచ్చింది. తమాయించుకున్నాడు.

చివరి బల్లలూ, ముందు బల్లలూ నిండి పోయినై. మధ్యనే ఖాళీ వుంది. ఓచోటకెళ్ళి వారగా కూచున్నాడు. కాళ్ళ దగ్గర కారియర్ పెట్టుకున్నాడు.

"సత్తెప్పాలా ఎంతకొన్నావ్?"

అడిగాడు తోటి విద్యార్థి. చక్కగా నలగని మల్లెపూవల్లే వున్నా డతను నెమ్మదిగా అడిగాడు.

"నాకు తెలీదు. మా అమ్మ ఇచ్చింది"

"మంచి పనే చేసింది."

"ఏం?"

మాస్టరు క్లాసులో కొచ్చాడు. అల్లరి ఆగింది. పాఠం ప్రారంభించాడు. ముందు కాస్సేపు కొద్దిగా కబుర్లు చెప్పాడు. పాఠం ఎత్తుకున్నాడు. చెప్పిందేమీ లేదుగాని, చేప్పే విధం బాగుంది.

క్లాసు అయింది. యింకో గదిలోకి పోవాలి. గంట కొట్టగానే అందరూ లేచారు. నాగభూషి లేచాడు. అన్నం కారియరో? యిక్కడ ఉంచి పోతేనేం? రెండడుగులువేశాడు. ఏమైపోతుందోననిపించింది. వెనక్కువెళ్ళిదాన్ని తీసుకున్నాడు. ఇక్కడ పెట్టుకున్నట్టే అక్కడా పెట్టుకోవచ్చనుకున్నాడు.

ఇలాంటివి పెట్టుకుంటానికి గది ఏమన్నా ఉందేమోనని పించింది. ఎవర్ని అడగడం? తల వొంచుకుని బయలు దేరాడు.

యిందాకా ఎంతకొన్నావ్ అన్న అబ్బాయిని అడిగితే.... .... ఏం అంటాడో, ఏం ఎక్కిరిస్తాడో. యిందాక నెమ్మదిగానే—ఎక్కి

రించడం కానట్టే—అడిగాడే మరి. ముక్కూ మొహమూ తెలియకుండా ఎవర్ని అడుగుతాడు? పలకరించింది ఒక్కడే. అతన్నే అడిగాడు.

"అన్నాలగది ఏదన్నా ఉందా ఇక్కడ?"

"చద్దెన్నాల గదీనా?"

"చద్దెన్నం ఎందుకైందీ? తెచ్చుకున్న అన్నం పెట్టుకుతినేగది!"

"చల్లారిన అన్నం చద్దెన్నం కాదుటోయ్. చద్దెన్నం అంటే కాదంటావేం?"

"సరేలే, చద్దెన్నాల గదే"

"అంత ఉక్రోషం ఎందుకోయ్—చద్దెన్నాల గదేగా"

నాగభూషి మాట్లాడలేదు. ప్రాణం చివుక్కుమంది. చూస్తు న్నాడు. ఆ కుర్రాడు ప్రసంగం వొదిలేసి తన ఫక్కనున్న విద్యార్థితో వేరే మాట్లాడుతున్నాడు. నాగభూషికి చిన్నతనం వేసింది.

"చెప్పమంటే చెప్పవేమోయ్, గది ఎక్కడుందీ?"

"సోది అడుగు, తెలుస్తుంది."

"లేనేలేదా"

"సొరాజ్యం వొస్తే చద్దెన్నాల గది వొస్తుంది." పక్కనున్న నలుగురూ నవ్వారు.

నాగభూషికి మరీ చిన్నతనం వేసింది. తల వొంచుకున్నాడు. వెన కటి లాగానే పక్కన పెట్టుకున్నాడు. వెధవ కారీరు, కొక్కెమన్నా లేదు. తాడు కట్టిన కారీరు. ఎక్కిరిస్తారంటే వాళ్ళ తప్పేముంది? ఏం, అన్నం తెచ్చుకోడం తప్పా? అన్నం తింటం తప్పా?

క్లాసులోకి వెళ్ళి కూచున్నాడు. ఈ క్లాసులోనూ "సత్తెప్పాలా" అనబడింది. అందరూ అతన్ని తలెత్తి తేరిపార చూట్టమూ అయింది.

ఫక్కున నవ్వడమూ అయింది. మాస్టరు వొచ్చాడు. క్లాసు ధణుతెగర గొట్టాడు. తన యావలో ఉన్నాడేమో కాస్సేపు నాగభూషికి అర్థంకాలేదు. తరువాత్తరువాత బోధపడింది.

అందరూ ఫౌంటెన్ పెన్నులు తీసి నోట్సు రాసుకుంటున్నారు. తను పెన్సిలుతోటే రాసుకున్నాడు. ఇదీ చిన్నతనమే వేసింది. పండక్కు తనూ కొనుక్కుంటాడు. ముష్టి కలం! గట్టిగా అడిగితే యివాళే కొనుక్కో మంటుంది అమ్మ! ఆమాటకొస్తే కొనుక్కోమనే అంది, తనే ఆగాడు కానీ——

బడి అయింది. బిలబిల లాడుతూ పిల్లలు బైటి కొస్తున్నారు. ఆ గలభాలో అణచినా అణగని ఉద్రేకమూ ఉంది, ఆనందమూ వుంది. 'సత్తెప్పాలా!' కొత్త నినాదం. కాస్సేపటితో ఆ నినాదం ఐపోయింది. ఎవరి ఇళ్ళకు వాళ్ళు వెళ్ళారు. బడి పక్కనఉన్న పెద్ద అరుగుల మీదకి నాగభూషి వెళ్ళాడు. అతనికి ఆకలీ, అన్నం గుర్తుకు రాలేదు. నిజానికి ఆకలి వెయ్యడం లేదు.

మాస్టరు చెప్పింది నెమరుకు వొస్తోంది. నోట్స్‌తీసి చూశాడు. టెక్స్టట్ పుస్తకాలు తీసి చూశాడు. చెప్పిందంతా కళ్ళముందు ఆడింది. ఇప్పుడు తను ఎవరికైనా సరే తిరిగి చెప్పెయగలడు.

ఎండ మలమల మాడుస్తోంది. పన్నెండు కావొస్తోంది. అన్నం తిందామనిపించింది. తిందాంలే అని కాస్సేపు జాప్యం చేశాడు. చుర్రు మంటోంది ఆకలి. లేచాడు. పుస్తకాలు సర్దాడు. టిఫిన్ కారీరు మూత తీశాడు. మజ్జిగ అన్నమూనూ, కంది పచ్చడీ!

చేతులూ, కాళ్ళూ కడుక్కుని తినేస్తే సరి. కారీరుకు మళ్ళీ మూతపెట్టాడు. చేతులూ, కాళ్ళూ ఎక్కడ కడుక్కోడం? పంపు ఎక్క

డుందో? బడికి దగ్గర్లోనే పంపు వుంటుంది అని చెప్పిందే అమ్మ. ఎటుందో ఖైతకాలి.

ఇవి ఇక్కడ పెట్టి ఎల్లా పోటం? రెండు చేతులతోనూ రెండూ పుచ్చుకుని బయలుదేరాడు. నెత్తి మాడుస్తోంది ఎండ. కింద కాళ్ళు భగ్గుమంటున్నాయి. వొళ్ళంతా తుకతుకలాడుతోంది. తన వొళ్ళు తనకే అసహ్యం వేస్తోంది. పంపు దగ్గిరకి వెళ్ళి కాళ్ళూ, చేతులూ ముఖమూ కడుక్కుంటేనేగాని తోచేట్టు లేదు. తిరిగి తిరిగి మళ్ళీ మొదటికి వొచ్చాడు. పంపు కనబడలేదు. అరె! పక్క మలుపులోనే వుంది పంపు. సూర్యుడు నడి నెత్తికొచ్చాడు. కాళ్ళుమాడుతున్నై.

తనకు తెలీక కొట్టుకులాడాడు గానీ, పక్కనే ఉంది పంపు. అమ్మ అబద్ధం చెప్పదు. ఇందాకే ఏ కుర్రాణ్ణన్నా కనుక్కుంటే చిక్కే వుండేదికాదు. బడి ప్యూన్‌ను అడగాలిసింది. ఇప్పుడతనూ ఉండడు. అమ్మ ఏం అనుకుంటుందో? తనను మర్చిపోయి వుంటుంది. ఈ పాటికి కరణం గారింట్లో అందరూ భోజనాలు చేస్తుంటారు.

పంపు దగ్గరికి వెళ్ళాడు. పంపు కట్టేశారు. నీటి చుక్కలేదు. ఎల్లాగబ్బా ఈ పంపే కట్టారా, అన్నీ కట్టేశారా? కొన్ని పంపుల్లో ఎప్పుడూ నీళ్ళొస్తయ్యని అంటారే. యీ పంపులో రావన్నమాట. మరే పంపులో వొస్తయ్యో? దాహం వేస్తోంది, గొంతుక పొడి ఆరిపోతోంది. వొళ్ళు అసహ్యంగా వుంది. కాళ్ళు మాడి, మంట బుర్రకెక్కుతోంది. అడుగులు పడడంలేదు కానీ, ఆగలేదు. దబదబా ఉరుకులు పరుగులు పెట్టకపోతే నేలమీద నిలవడం కష్టం. చెరువంటూ ఉంటే ఒక్కదూకున వెళ్ళి అందులో పడును తను. దాహం తాగడానికి గతిలేదు గానీ. చెరువు!

చేతిలో పుస్తకాలు తగ్గట్టు జారుతున్నై. అల్లాగే ఆగాడు. సర్దుకున్నాడు. కారియర్ పట్టుకుని పోతున్నాడు.

ఇంకో పంపు కనబడింది. ఏంలాభం? అదీ కట్టేశారు. తిరిగి తిరిగి మరో పంపు చూశాడు. అదీ కట్టేసుంది.

ఎంగిలి విస్తరాకు కనబడింది. ఎవడో మరి, ఆవకాయ ముక్క కొరక్కుండానే పడేశాడు. నిమిషం నిదానించి ఆత్రంగా చూశాడు నాగభూషి. ఎండలో ఆవకాయముక్క మెరుస్తోంది. కాళ్ళు బొబ్బ లెక్కినట్టున్నై.

కాళ్ళు ఇక ఆగటం లేదు. పంపుదగ్గర ఉన్న మురుగు దగ్గిరకి వెళ్ళాడు. కాళ్ళు దాంట్లో పెట్టాడు. అమ్మ! కాస్తనయం. అదీ చుర్రుమంది. ఐతేనేం కాళ్ళకు తడి తగిలింది గదా. ఇక్కడా భగ్గుమన్నట్టు ఉంది. అబ్బో.

ఎవరినన్నా అడిగితే?

ఎవరిని అడిగేది?

ఇందాక బళ్ళో ఏమైంది? మాట చెప్పటానికి అంత అల్లరయిందే....

"ఎవ్వరినీ ఏమీ అడగ్గూడదు. ప్రాణం పోతున్నా సరే" అంటుంది అమ్మ. నిన్నరాత్రి గూడా అనుకుంది.

"ఏమిటల్లా వెతుకుతున్నావ్? రా, ఓశ్, మంచినీళ్ళేగదా" అని ఎవరన్నా అనగూడదూ? ఎవరంటారు? అమ్మైతే అంటుంది. ఇక్కడ అమ్మలేదే?

నాగభూషికి కళ్ళల్లో నీళ్ళు తిరిగై. మురిక్కాలవలో నుంచోటం గూడా కష్టం అనిపించింది. ఎవరన్నా చూస్తే నవ్వుతారు. నవ్వితే నవ్వారు, కాళ్ళుమాడి చావటం కంటే మరేమీ కాదు అవి. ఇక్కడగ్గూడా ఏం బాగుండలేదు. ఆ బుర్రదకాళ్ళతోనే బయలుదేరాడు. ఇందాకటి అరుగుల దగ్గరికి వచ్చాడు. పుస్తకాలూ, కారియరూ అక్కడ పెట్టాడు.

'అబ్బ' అనుకున్నాడు. కాస్సేపు పడుకుందామనిపించింది. ఆ అరుగు మీదే పడుకున్నాడు. ఇటూ అటూ దొర్లాడు. మరింత దుమ్ము వొంటికి అంటుకుంది.

ప్రాణం సొమ్మసిలిపోయింది. రివ్వున గాలి వెచ్చగా తగిలింది. నిద్ర పట్టింది. దుంగలాగ పడుకుని నిద్రపోయాడు. ప్రాణం సొరేసుకుపోయి నిద్రపట్టింది. మెళకువ వచ్చింది. గంట కొడుతున్నారు. బద్ధకంగా వుంది. పిల్లలుపోతున్నారు. అడుగో యిందాకటి అబ్బాయి వెళుతున్నాడు. నాగభూషి నెమ్మదిగా లేచాడు. వొళ్ళంతా దుమ్ము కొట్టుకునుంది. కనబడ్డ మేరకు చేత్తో రాశాడు. చొక్కా అసహ్యంగా వుంది. ఉంటే ఉందిలే అనుకున్నాడు. పుస్తకాలు తీసుకున్నాడు. సత్తు టిఫిన్‌కారియర్‌ను చూస్తే అసహ్యం వేసింది. దిక్కుమాలిన సత్తెప్పాలా! అమ్మ ఇచ్చింది. అమ్మ ఏమనుకుంటుందో. యీ పాటికి అమ్మ కరణం గారి వసారాలో చెంగు పరుచుకుని పడుకుంటుంది.

పుస్తకాలూ, కారియరూ రెండు చేతుల్లోనూ పట్టుకుని బయలు దేరాడు. వొళ్ళు తేలిగ్గా, నీరసంగా ఉంది.

క్లాసుకు వెళ్ళాడు. చిత్రంగా ఉంది. పొద్దుటి గదేనా ఇది. కారియరు మామూలుగా పెట్టాడు.

క్లాసు జరుగుతోంది. పాఠాలు వినబుద్ధే పుట్టడం లేదు. చిత్రం, ఇందాక అంత దాహం వేసిందా, ఇప్పుడు దాహమే లేదు. అన్నం తిన లేదే అన్నది మనస్సును మహా వేధిస్తోంది. క్లాసులో ఏం జరుగుతోందో తెలియదు. ఉడికిన బంగళా దుంపలాగున్నాడతను. చెప్పిన పాఠం బుర్రకెక్కలేదు. గంట కొట్టారు.

వికారంగా ఉండి లేచిపోదామా అనిపించింది. ఏమైనాసరే అని చదువుకోవచ్చాడు తను. బాగానే ఉంది కథ. లేచిపోతే ఎలా?

క్లాసులో చెప్పేది వినబడీ వినబడనట్టుగా ఉంటోంది. కళ్ళు మూసుకున్నాడు. కళ్ళముందు పచ్చపచ్చగా, ఎర్రఎర్రగా, మసకలు మసకలుగా కనబడుతున్నై. కళ్ళు తెరిచాడు. క్లాసు అయింది.

దాహం, తాగాలి. పక్క మలుపులోని పంపు దగ్గరికి వెళ్ళాడు. నీళ్ళు వొచ్చై. కాళ్ళు తడుపుకున్నాడు. ఆత్రంగా పొట్టపట్టినన్ని నీళ్ళు తాగాడు. తలా, చేతులూ కాళ్ళూ తడుపుకున్నాడు. ఆ చొక్కాతోనే మొహం తుడుచుకున్నాడు. తన వొళ్ళు తనకు తుప్పు కంపు వేస్తోంది

మళ్ళీ క్లాసులోకి వొచ్చాడు. క్లాసు కుచ్చిటప్పాలతోటి నడుం స్తోంది. అన్నంమీదికి కన్నుపోయింది. అన్నం తినాలనిపించలేదు. క్లాసు మామూలుగానే జరిగింది.

రప్ రప్ మంటూ కేరింతా లాడుతూ కుర్రాళ్ళంతా బయలు దేరారు.

అటలకని కొందరు గ్రౌండ్సులోకి పోబోతున్నారు.

"నువ్వుగూడా వొస్తావా?"

పొద్దుటి కుర్రాడు కాడు. మరొకడు.

"ఉహూ. రాను"

"ఏం. అల్లా నూతిలో పడ్డట్టు మాట్లాడుతున్నావ్?"

నాగభూషి మాట్లాడలేదు.

"గేమ్సు ఫీ కట్టలా నువుమాత్రం"

నాగభూషి తల ఊపాడు.

"సత్తెప్పాలా గాడితో ఏమిట్రా" అంటూ మరో కుర్రాడువచ్చి చూడక అన్నట్టు నటించాడు. మాట్లాడుతూన్న కుర్రాడు నవ్వాడు.

కొత్తకుర్రాడు నీ పేరేమిటన్నాడు. నాగభూషికి కోపం వొచ్చింది "సత్తెప్పాలా" అన్నాడు.

"భేష్" అని ఇద్దరూ చక్కాపోయారు.

తన్ను ఎగతాళి చేశారన్న మంట దహించుకు తింటోంది. షంపుల్లోనీళ్ళు కావలసినన్ని ఎందుకు, తగలెయ్యనా? వెధవనీళ్ళు ప్రాణంపోతున్నా బొట్టు పడలేదు. అక్కర్లేనప్పుడు ఇబ్బడీ, ముబ్బడీ.

కాళ్ళు ఊరికే నములుతున్నై. ఒళ్ళంతా పచ్చిపుండల్లే ఉంది. చేతిలో ఈ కారియరు బరువొకటి.

తలొంచుకుని నడుస్తూన్నాడు. రోడ్డుకు ఒకప్రక్కనే నడవలేక పోయాడు. అడుగులు తేలుతున్నై. మనిషి తూలుతున్నాడు. కాస్సేపు రోడ్డుకు ఓ చివరా, మరికాస్సేపు రోడ్డుమధ్యనా, యింకాస్సేపటికి అవతలి పెడనూ నడుస్తున్నాడు. ఇదేమిటి ఈచివరికి వచ్చాను అని అనుకుంటున్నాడు. మరికొంచంసేపటికి అద్దరిన అడుగులేస్తున్నాడు. ఎవరో కక్ష కట్టి సాధిస్తున్నపుడు పీడితుడున్నట్టు ఉన్నాడు నాగభూషి.

నాగభూషికి తల్లి కళ్ళకక్కనబడ్డది. అమ్మ ఏం చేస్తోందో? తనను గురించి ఏమనుకుంటోందో?

అందరికీ వడ్డన చేసింది సీతమ్మ. కొడుకు కళ్ళలో మెదిలినట్లు అయింది ఆమెకు. విస్తరేసుకుని అన్నంముందు కూర్చుందన్న మాటే గాని ఆమెకా అన్నం సయించలేదు. అన్నహితవు తప్పినట్లు అయింది. నాగభూషి జాగర్తగా చేరుకున్నాడో, ఏమన్నానో.... పసివెధవ అంతమందిలో బిక్కమొహం వేసుకుని ఏమవుతున్నాడో.... అన్నం తిన్నాడో, లేదో? సీతమ్మకు ముద్ద నోటికెక్కలేదు. గోడకేసి అల్లాగే చూస్తూ కూర్చుంది. ఏమిటేమిటో జ్ఞాపకాలు రాసాగినవి. ఆ ప్రవాహంలో పడి ఆమె ఉక్కిరిబిక్కిరి అయింది.

"సీతమ్మా! ఏం చేస్తున్నా"—ఆమెకు వినబడలేదు.

"ఇదుగో, నిన్నే—"

తలెత్తింది. కరణం గారి భార్య. చప్పున స్పృహ తెచ్చుకుంది. "అన్నం తింటున్నా" నంది. బొంకింది అలా. చిన్నచిన్న తప్పులు పట్టుబడ్డప్పుడే బొంకటం జరుగుతుంది.

"మరేంలేదుగానీ, మరిచిపోయి మైలపడకు. కందులు వేయిద్దుగాని" అంది కరణంగారి భార్య.

"అయ్యో! సరే—"

"ఏం, వేరే ఏమన్నా పనుందా?"

"అబ్బే! ఆ మాట తెలిస్తే వేయించే కూచునేదాన్ని. అన్నంతిన్న బట్టగదా అని చూస్తున్నా...."

"మరేం ఫరవాలేదులెస్తూ మడిబట్టేగా" అని వెళ్ళింది కరణంగారి భార్య. మళ్ళీ తిరిగి వొచ్చింది.

"ఇందాక కందులు తడిపి ఆరబోయించానూ, మరచిపోబోకూ" అని చెప్పింది. దర్జాగా సావిట్లోకి వెళ్ళిపోయిందామె.

సీతమ్మకు తోచలేదు. అన్నంముందు కూచోటం కాలేకాలే పెన మీమ్మద కూచున్నట్టుంది. మూతి తుడుచుకుంది. మంగలం ముందేసుకు కూచుంది.

ఆలోచనలకు, అగ్నిహోత్రుడికీ సయోధ్యల్లే ఉంది. నిప్పు కణ కణమంటున్న కొద్దీ ఆలోచనలు అతివేగంగా వొస్తాయి. వేపు ఎక్కడ ముందర వేగుతుందో....కాటోతుందని ఆమె ఎంత వాళ్ళదగ్గర పెట్టు కున్నా పంచప్రాణాలూ పిల్లాడిమీదనే ఉన్నాయి.

దిక్కుమాలినదాన్ని యీచాకిరీ ఆ ఊళ్ళోనే కుదుర్చుకున్నాను గాదు అనుకుంది. పోనీ, నలుగురితో చెప్పిపెట్టో, రెండుమూడురోజులు తిరిగో అక్కడే పని చూసుకుందామనుకుంది.ఊరు కదలడమంటే మళ్ళీ మనస్కరించలేదు. యీ మల్లాగుల్లాలు పడడం ఇదెన్నోసారో....యిల్లా రోజూ మల్లాగుల్లాలు పడడమేనా అనుకుంది. అక్కడికి పోక తప్పదనుకుంది. కరణంగారేమంటారో....పనిమానుకునిపోయేది ఎల్లాగో పోతుంది అనుకుని, ఏదన్నా అభాండం మీదపడెయ్యరుగదా. ఛః చెప్పివెళితే ఎందుకేస్తారుః

పోదాం పోదామనుకోటమేగాని, పోగానే అక్కడ దబ్బున పని కుదురుతుందా అనుకుంది.

ఏమైనాసరే, యిక్కడినుంచి పనిమానుకుని పోనని తేల్చుకుంది.

సీతమ్మకు నవ్వు వొచ్చింది. పదేళ్ళు చేసిన యింట్లోంచి పోవాలంటేనే యింత హైరానాపడుతోందే—అన్నేళ్ళున్న జీవుడు లేచి పోవాలనుకుని అంత హైరానాపడతాడు కాబోలు అనిపించి నవ్వింది. వాడిలిపోయిన పువ్వు ఆ నవ్వు.పప్పు ముదరవేగింది. దబదబా దించింది. మళ్ళీ యింకో వాయి వేసింది.

పాపం వారు పోయేనాటిరాత్రి భళ్ళున తెల్లవారింది. తెల్లవార్లూ వారు మహా యమచర పడ్డారు. యింకాస్సేపటికి భూశయనం చేస్తారనగా "సీతా" అని పిల్చారు.

"సీతా!"

"వోయ్ దగ్గిరే ఉన్నా"

"మాట"

ఆమె దగ్గరగా వెళ్ళింది. "మరేంలేదు. మాటదక్కింది. (ఐపోయింది అనర్థం) ఆధారం లేనివాళ్ళం. పిల్లాడు జాగర్త"

మళ్ళీ మగత కమ్మింది. బద్దలయ్యేట్టు లాంతరు వెలుగుతున్నా చిమ్మ చీకటి అయిందప్పుడు తనకు. "పిల్లాడు జాగర్త అన్నారు" అనుకుంది.

రాత్రికి వంట చేస్తోంది సీతమ్మ.

"అమ్మా!"

తలెత్తి చూసింది. నాగభూషి కాదు. పనివాడు. కరేపాకు తెచ్చి యిచ్చి వెళ్ళిపోయాడు. యింకా నాగభూషి రాలేదు. ఆమెకు ఉడ్డుకుడుచుకున్నట్టుగా ఉంది. తను పెద్దదయ్యేదాకా ఎల్లాగన్నా యీడవొచ్చు. వాడు దబదబా పైకివస్తే యీ యాతన తప్పుతుంది అనుకుంది.

"అమ్మా!"

నాగభూషే. "ఏరా ఆలిశ్యంగా వచ్చావ్" అంది. దబదబా చెయిశీ తెరిపి చేసుకుంది. యివతలికి వచ్చింది. పిల్లాడి మొహం వాడిపోయి వుంది.

"అమ్మా!"

నాగభూషికి ఏడుపు ఆగలేదు. వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. తల్లిని వాటేసుకున్నాడు. "నే బళ్ళోకి పోనే—"అన్నాడు ఏడుపు దిగమింగుతూ.

"ఏంరా" అంది ఆదుర్దాగా. వేరే మడిబట్టలేదనీ, మైల పడుతున్నాననీ ఆమెకి తట్టనే లేదు. కొడుకును పొదివి పట్టుకుంది.

"చంపినా సరే— నేను పోనే—" అన్నాడు నాగభూషి ఏడుస్తూనే. ఈసారి అతను దుఃఖాన్ని మింగలేక పోయాడు.

"నేను పోనే" అని బావురుమన్నాడు.